క్లుప్తంగా

నేడు మంత్రి పర్యటన

కుందుర్పి: మండలంలోని తెనగల్లు గ్రామ పంచాయతీలో గురువారం వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమ శాఖమంత్రి ఉషశ్రీ చరణ్ పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రీ ఓ ప్రకటనలో తెలిపారు.

కంబదూరులో...

కంబదూరు: మండలంలోని కురాకులపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న కృష్ణాష్టమి వేడుకల్లో మంత్రి ఉషశ్రీచరణ్ పాల్గొంటారని సర్పంచ్ చంంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని యాదవులందరూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

వర్షం కోసం పాదయాత్ర



పాదయాత్రగా బొంగును తీసుకొస్తున్న భక్తులు

బొమ్మనహాళ్: వర్షాలు కురవాలని మండలంలోని దర్గాహొన్నూరు గ్రామానికి చెందిన దాదాపు 40 మంది భక్తులు పాదయాత్ర నిర్వహించారు. కర్ణాటకలోని సండూరు వద్ద కుమారస్వామి కొండలో నుంచి 55 అడుగుల బొంగు తీసుకువచ్చి గ్రామంలోని కన్నేరమ్మ దేవి జెండా నాటితే వర్షాలు కురుస్తాయని నమ్మకంతో పాదయాత్ర నిర్వహించారు. గురువారం సాయంత్రానికి దర్గాహొన్నూరు గ్రామానికి చేరుకుని జెండా నాటుతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వన్నల్లి రామాంజినేయులు, ఎంపీటీసీ రామకృష్ణ, నాయకులు ఆనంద్‌రెడ్డి, కమిటీ సభ్యులు చిన్న సిద్దప్ప, తిప్పేస్వామి, పెద్ద వంద్రప్ప, గోవిందు, వీరన్నగౌడ్ నుంకేష్, తదితరులు పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటరు జాబితా సిద్ధం చేయాలి



ఓటరు జాబితాపై విచారణ చేస్తున్న ఏపీడీ అనురాధ

కూడేరు: తప్పులు లేని ఓటరు జాబితా సిద్ధం చేయాలని డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి , ఏపీడీ అనురాధ బీఎల్‌ఓలను ఆదేశించారు. బుధవారం వారు కూడేరు, కడదరకుంట, కమ్మూరులో ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలు ఉన్న వారితో మాట్లాడారు. ఇంతకముందు బీఎల్‌ఓలు మీ ఇంటి వద్దకు వచ్చారా, మీకు డబుల్ ఓటు ఉందని తెలిపారా అని ఆరా తీశారు. వారి అంగీకారంతో ఒక చోట ఓటు హక్కు ఉండేలా చర్యలు చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితా రీసర్వేపై సమీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషారెడ్డి, రీసర్వే సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, ప్రసన్నకుమార్, విజయ కుమార్, ఏపీఓ తులసీప్రసాద్ , రవి, బీఎల్‌ఓలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



కూడేరు: నగదు అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు అశ్విని

కూడేరు: కడదరకుంటకు చెందిన రాము కుటుంబానికి బుధవారం జెడ్పీటీసీ సభ్యురాలు తుప్పటి అశ్విని వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను అందించారు. మిగిలిన రూ.90 వేలను రాము భార్య చౌడమ్మ బ్యాంకు ఖాతాలో జమ చేస్తారని జెడ్పీటీసీ తెలిపారు. రాము ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుబ్బమ్మ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జైనబ్బీ ఉరుసుకు విరాళం



విరాళ మొత్తాన్ని అందిస్తున్న దృశ్యం

ఉరవకొండ: ఉరవకొండలోని హజరత్ బీబీ జైనబ్బీ అమ్మవారి ఉరుసుకు బుధవారం జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ జీఎంఎస్ మీరం బాషా, మండల కోఆప్షన్ సభ్యుడు పామిడి సలీం రూ.25 వేల చొప్పున విరాళాన్ని దర్గా కమిటీ సభ్యులకు అందించారు. ఈసందర్భంగా దర్గా కమిటీ అధ్యక్షుడు హోతూరు బాషా మాట్లాడుతూ ఈనెల 13 నుంచి ప్రారంభమయ్యే జైనబ్బీ అమ్మవారి ఉరుసుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనంతరం విరాళాలు అందించిన వక్ఫ్‌బోర్డు డైరెక్టర్, కోఆప్షన్ సభ్యుడిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దర్గా కమిటీ ఉపాధ్యక్షుడు బ్యాళ్ల ప్రసాద్, కార్యదర్శి జీఎంఎస్ షాకీర్, కోశాధికారి జెండా జిలాన్, అసోసియేట్ అధ్యక్షుడు వడ్లసలీం, సహాయ కార్యదర్శి శర్మాస్, సభ్యులు అన్వర్, ఆసీఫ్, ఎంఎ జిలాన్ దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నీకే గ్యారెంటీ లేదు.. ప్రజలకు ష్యూరిటీ ఇస్తావా?



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, చిత్రంలో పార్టీ నాయకులు

- వెన్నుపోటు చంద్రబాబుకు ఎన్టీఆర్ గురించి మాట్లాడే అర్హత లేదు
- రాయదుర్గంలో బాబు యాత్ర అట్టర్‌ఫ్లాప్
- వైఎస్సార్‌సీపీ నాయకుల ధ్వజం

రాయదుర్గం: చంద్రబాబుకే గ్యారెంటీ లేదు. అలాంటి వ్యక్తి ప్రజలకెలా ష్యూరిటీ ఇస్తారో అర్థం కావడం లేదని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, మార్కెట్‌యార్డ్ చైర్మన్ బోజరాజ్‌నాయక్, జెడ్పీటీసీ హొన్నే మల్లికార్జున మండిపడ్డారు. రాయదుర్గంలో బాబు యాత్ర అట్టర్ ఫ్లాప్ అయిందన్నారు. సీఎం కుర్చీ కోసం పిల్లనిచ్చిన మామ ఎన్టీఆర్‌నే వెన్నుపోటు పొడిచిన ద్రోహి చంద్రబాబు అని విమర్శించారు. పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్, విప్ కాపు రామచంద్రారెడ్డిని విమర్శించడం సరికాదన్నారు. బళ్లారిలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ చేపట్టి ఆయన ఆత్మను క్షోభకు గురిచేశారన్నారు. సీఎం వైఎస్ జగన్ పథకాల నుంచి పుట్టుకొచ్చిందే నారీశక్తి అని తెలిపారు. చంద్రబాబు పెద్ద సైకో అయితే, లోకేష్ చిన్న సైకో అని ధ్వజమెత్తారు. జగన్‌ను విమర్శిస్తే ప్రజలు తిరగబడి తన్నే రోజులు వస్తాయన్నారు. బీటీపీకి నీరిస్తామంటూ చంద్రబాబు మాయమాటలు చెప్పి మోసం చేశాడని జెడ్పీటీసీ మహేష్, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, సర్పంచ్ ఉమేష్‌రెడ్డి విమర్శించారు. కాలవ శ్రీనివాసులు ఇచ్చిన స్క్రిప్ట్ చదివి ప్రజల్లో చంద్రబాబు అభాసుపాలయ్యాడని నేమకల్లు సర్పంచ్ పరమేష్ ఎద్దేవా చేశారు. నేమకల్లు వద్ద టీడీపీ హయాంలోనే 50కు పైగా క్వారీలు సీజ్ చేస్తే, విప్ కాపుపై ఆ నింద నెట్టడం సరికాదన్నారు. టీడీపీ పాలనలో కాలవ శ్రీనివాసులు కనుసన్నల్లోనే ఇసుక, మట్టి గొట్టారని డీ. హీరేహాళ్ మండల కన్వీనర్ ఎమ్ వన్నూర్‌స్వామి ఆరోపించారు. కణేకల్లు మండలం రచ్చుమర్రి వద్ద ఏ స్థాయిలో ఇసుక దోపిడి జరిగిందో బాబు విచారించుకోవాలన్నారు. అమలుకు సాధ్యం కాని హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించడం బాబుకు వెన్నతో పెట్టిన విద్య అని పార్టీ సీనియర్ నాయకులు అరవ శివప్ప విమర్శించారు. హెచ్‌ఎల్‌సీకి పైప్‌లు వేసి రైతులతో డబ్బు వసూలు చేస్తున్నారని చంద్రబాబు చేసిన ఆరోపణలను కణేకల్లు టౌన్ కన్వీనర్ కేశవరెడ్డి ఖండించారు. విప్ కాపు రామచంద్రారెడ్డి రైతు సంక్షేమానికి పాటుపడతారే తప్ప టీడీపీ నాయకుల్లాగా డబ్బు వసూలు చేసే నీచ సంస్కృతి ఆయనది కాదన్నారు. బాబు హయాంలో జరిగిన హెచ్‌ఎల్‌సీ ఆధునికీకరణ పనులన్నీ ఉత్తివేనని, ఉంతకల్లు రిజర్వాయర్‌కు నీరిస్తామని చెప్పి మభ్య పెట్టారని ఎంపీపీ పద్మా వతి చంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి, సర్పంచ్ రాజకుమార్ ఆరోపించారు. హెచ్‌ఎల్‌సీ కాలువను బాగు చేసే బాధ్యత విప్ కాపు తీసుకుంటారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు రాళ్ల తిమ్మారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాషా, పొరాళ్ల గోవిందరాజులు, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ మేకల శ్రీనివాసులు, కౌన్సిలర్లు శారద, డీ గోవిందు, కొంతెం దేవరాజు, ఫక్రుద్దీన్, వన్నూర్‌స్వామి, పార్టీ నాయకులు, వార్డు ఇన్‌చార్జులు తదితరులు పాల్గొన్నారు.

తమ్ముళ్ల మధ్య వర్గపోరు



కళ్యాణదుర్గంలో ఫ్లెక్సీ చించేసిన దృశ్యం

కళ్యాణదుర్గం: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు కళ్యాణదుర్గం పర్యటనలో తెలుగు తమ్ముళ్ల మధ్య వర్గపోరు మరోమారు బట్టబయలైంది. ఒంటిమిద్ది వద్దకు చంద్రబాబు వస్తున్న క్రమంలో గజమాల వేసి స్వాగతం పలికేందుకు మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి, టీడీపీ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు వర్గాల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. గజమాల వేసేందుకు ఇరువర్గాలు రెండు క్రేన్లు సిద్ధం చేసుకొని పోటీపడ్డారు. ప్రధానదారిలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కల్గడంతో పోలీసులు రంగప్రవేశం చేసి వారిని శాంత పరిచారు. చంద్రబాబు సెల్ఫీ ప్రాంగణానికి రాక ముందే వర్గపోరు మరోమారు బట్టబయలు అవడంతో చంద్రబాబు కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎవరిని ప్రకటిస్తాడోనని తెలుగు తమ్ముళ్లు గుసగుసలాడారు. ఇదిలా ఉంటే ఇరువార్గాలు ఎదుటివారి ఫ్లెక్సీలు చించుకొని వాదులాడుకున్నారు.

● మందెయ్.. చిందెయ్



వాల్మీకి సర్కిల్‌లోని వైన్‌షాపు వద్ద టీడీపీ జెండాలు పట్టుకొని మద్యం కొంటున్న దృశ్యం



బార్ వద్ద తెలుగుదేశం జెండాతో పాటు మద్యం బాటిళ్లు చేతపట్టుకున్న తమ్ముళ్లు

కళ్యాణదుర్గం: పట్టణంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో తెలుగు తమ్ముళ్లు మద్యం షాపుల దగ్గర హల్‌చల్ చేశారు. తెలుగు తమ్ముళ్లు పట్టణంలోని అన్ని బార్లు, రెస్టారెంట్ల వద్ద క్యూ కట్టారు. రోడ్లపై మద్యం సీసాలు చేత పట్టి చిందులు వేశారు.

గద్దర్‌కు ఘన నివాళి



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాకారులు

కూడేరు: ప్రజాగాయకుడు గద్దర్ విప్లవ కవి అని ప్రజా కళాకారుల సంఘం నేతలు పేర్కొన్నారు. ప్రజా కళాకారుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో గద్దర్ సంస్మరణ సభ నిర్వహించారు. ప్రజాగాయకుడు ఆదినారాయణ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకుడు సాకేహరి, మహాబోధి కృష్ణమూర్తి, మన్నల లక్ష్మన్న , గాయకులు ఎర్రిస్వామి, సంజీవ రాయుడు, వన్నూరప్ప, కృష్ణవేణి హాజరయ్యారు. గద్దర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ గద్దర్ పాటలు ఎంతోమందికి పోరాట స్ఫూర్తిని కల్గించాయన్నారు.

గోశాలకు ఆవుల తరలింపు

అనంతపురం క్రైం: నగరంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్లపై ఉన్న ఆవులను తరలించేందుకు నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకున్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి ఆదేశాలతో కార్యదర్శి సంగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం అర్ధరాత్రి అశోక్‌నగర్ ప్రాంతంలో రోడ్లపై ఉన్న ఆవులను తరలించేందుకు యత్నించారు. ఈ క్రమంలో అశోక్‌నగర్‌కు చెందిన ఆవుల యజమాని విజయేంద్ర అడ్డుకునే ప్రయత్నం చేశాడు. నగర ప్రజలు, ట్రాఫిక్‌కు ఇబ్బంది కల్గిస్తున్న ఆవులను గోశాలకు తరలిస్తుంటే అడ్డుకోవడం సరికాదని కార్యదర్శి సంగం శ్రీనివాసులు హితవు పలికారు. కానీ విజయేంద్ర అధికారుల విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు వన్‌టౌన్ పీఎస్‌లో అతడిపై ఫిర్యాదు చేశారు. ఆవులను ఎక్కడపడితే అక్కడ వదలకూడదని ఆవుల యజమానులకు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ఉరవకొండ: స్థానిక దేవాంగ ఫంక్షన్ హాల్ వెనుక వైపు నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణుని మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో విశేష పుష్పాలతో అలంకరించిన వాహనంలో శ్రీకృష్ణుని చిత్రపటాన్ని ఉంచి పట్టణవీధుల్లో ఊరేగించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలతో అలంకరించారు. అనంతరం సామూహిక గీతాపారాయణం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేపట్టారు.

కూడేరు: కూడేరులోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశ్వ విద్యాలయం మండల సంచాలకురాలు కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. సంగమేశ్వర స్కూల్ విద్యార్థులు శ్రీకృష్ణుడి, గోపికల వేషధారణలతో 'గోపికమ్మ చాలునులేమ్మా' అనే పాటకు చేసిన నృత్యం అలరించింది. కార్యక్రమంలో విశ్వ విద్యాలయం సభ్యులు కే.శ్రీదేవి, నారాయణరెడ్డి, శ్రీదేవి, చెన్నకేశవరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



వేడుకలకు ముస్తాబైన శ్రీవేణుగోపాలస్వామి ఆలయం



కృష్ణాశ్రమంలో వెలసిన శ్రీకృష్ణుడు



ముప్పలకుంటలో పూజలందుకున్న స్వామి



ఉరవకొండ: శ్రీకృష్ణ ఆలయంలో సామూహిక గీతాపారాయణం చేస్తున్న భక్తులు



కూడేరు: కేక్ కట్ చేస్తున్న సంచాలకురాలు వేదావతి

కణేకల్లు మండలంలో...

కణేకల్లు: స్థానిక జేపీఆర్ ఫంక్షన్ హాలులో బుధవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. తొలుత శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదికపై చిన్నారులు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణతో నిర్వహించిన ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. పోటీల్లో మొదటి బహుమతి దీక్ష, ద్వితీయ బహుమతి చర్విత్‌సాయి, తృతీయ బహుమతి హర్షల్ పొందారు. విజేతలకు బహుమతులను రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ రామిరెడ్డి, స్కూల్ హెచ్‌ఎం బి.స్వరూపరాణి, కరస్పాండెంట్ బి.ప్రభంజన్‌రెడ్డిలు పంపిణీ చేశారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

బ్రహ్మసముద్రం: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో కృష్ణాష్టమిని ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని ముప్పలకుంట , పాలవెంకటాపురం తిప్పయ్యదొడ్డి , అజ్జయ్యదొడ్డి, ఎర్రకొండాపురం కన్నేపల్లి గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి .

శ్రీకృష్ణాష్టమి వేడుకలకు ముస్తాబు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని తహసీల్దార్ రోడ్డులో వెలసిన ప్రముఖ సంతాన వేణుగోపాలస్వామి ఆలయం, రైల్వేస్టేషన్ వద్ద గల శ్రీకృష్ణాశ్రమం గురువారం శ్రీకృష్ణ జయంతి వేడుకలకు ముస్తాబయ్యాయి. ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం ఉదయం నుంచి పూజలు, సంకల్పఫల పంచామృతాభిషేకం, స్వామి అర్చనానంద వారిచే విష్ణు సహస్రనామ స్తోత్రం, సామూహిక పారాయణ, శ్రీకృష్ణనామ సంకీర్తనలు, స్వామి ఊరేగింపు, శ్రీవారి ప్రాకారోత్సవం, పల్లకిసేవ ఉంటుందని కమిటీ అధ్యక్షుడు మేకల శ్రీనివాసులు తెలిపారు. అలాగే రైల్వే స్టేషన్ వద్ద గల శ్రీకృష్ణాశ్రమం నందు గోకులాష్టమి వేడుకలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి శ్రీకృష్ణ భగవానునికి పూజలు, విష్ణు అష్టోత్తరశత నామార్చనలు, భజనలు, ఉత్సవ కార్యక్రమం, గీతా సందేశం జరుగుతాయన్నారు.

కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న మంత్రి



కృష్ణాష్టమి వేడుకల్లో మంత్రి ఉషశ్రీచరణ్

కంబదూరు: మండలంలోని జెక్కిరెడ్డిపల్లి, కదిరిదేవరపల్లి గ్రామాల్లో బుధవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో రాష్ట్ర స్త్రీ.శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీచరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణుని చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. తర్వాత మంత్రి ఉట్టిని కొట్టి అలరించారు.

ఆలయ నిర్మాణానికి రూ.7.50 లక్షల మంజూరు

కదిరిదేవరపల్లిలో నూతనంగా శ్రీకృష్ణ దేవాలయం నిర్మాణానికి మంత్రి ఉషశ్రీచరణ్ ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.7.50 లక్షలు కేటాయించారు. దీంతో యాదవులు మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ రామ్మోహన్, జిల్లా కమిటీ సభ్యులు నీలి శంకరప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలరాజు, వైస్ ఎంపీపీ బీమేష్ , సర్పంచ్ హరినాథ్, ఎంపీటీసీ సభ్యులు బసప్ప తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి ప్రశాంతంగా జరుపుకుందాం



మండపానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: మత సామరస్యం వెల్లివిరిసేలా అన్ని వినాయక చవితిని జరుపుకుందామని మేయర్ వసీం సలీం అన్నారు. బుధవారం గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సప్తగిరి సర్కిల్ సమీపంలో వినాయక మండపానికి భూమి పూజ చేశారు. సమితి కార్యదర్శి పరుచూరు రమేష్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కాషాయ ధ్వజాన్ని ఎగురేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈనెల 18 నుంచి 22 వరకు వైభవంగా వినాయక చవితి వేడుకలు నిర్వహిస్తామన్నారు. కర్ణాటకలోని చిక్‌మంగళూరులో ప్రసిద్ధి చెందిన కమండల గణపతి దేవస్థానం ఆకృతితో కదలికల గణపతిని ప్రతిష్టిస్తామన్నారు. అదేవిధంగా డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ.. వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అనిల్ కుమార్‌రెడ్డి, కమల్‌భూషణ్, గూడూరు మల్లికార్జున, బీజేపీ నాయకులు సందిరెడ్డి శ్రీనివాసులు, లలిత్‌కుమార్, సుంకు వేణుగోపాల్, హర్ష, ప్రమోద్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఖాజా, దాదు, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

- త్రీటౌన్ సీఐ ధరణీకిషోర్

అనంతపురంశ్రీకంఠంసర్కిల్: త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ ధరణీకిషోర్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో అల్లరి మూకలను గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. తాజాగా త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఇద్దారు గంజాయి విక్రేతలను గుర్తించి వారిపై కూడా రైడీషీట్లు తెరిచినట్లు పేర్కొన్నారు. త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయాలు లేకుండా ఉక్కుపాదం మోపినట్లు వెల్లడించారు. పలుచోట్ల దాడి చేసి, పేకాట స్థావరాలను గుర్తించామన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏమైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే 94906 18679 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందు తున్న వెంకటలక్ష్మి

గుత్తి: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం గొల్లమానుపల్లిలో ఓ మహిళ బుధవారం ఆత్మహత్యకు యత్నించింది. పోలీసులు వివరాల మేరకు.. గొల్లమానుపల్లికి చెందిన వెంకటలక్ష్మి, రంగారెడ్డి అక్కా తమ్ముడు. వీరి మధ్య కొంత కాలంగా ఆస్తి తగాదా కొనసాగుతోంది. ఈ క్రమంలో బుధవారం రంగారెడ్డి అక్క వెంకట లక్ష్మి ఇంటికెళ్లి ఆస్తి విషయంలో గొడవ పెట్టుకున్నాడు. అంతటితో ఆగకుండా అందరూ చూస్తుండగానే కింద పడేసి ఇష్టానుసారం కొట్టాడు. స్థానికులు సర్దిజెప్పినా వినలేదు. దీంతో మనస్తాపం చెందిన వెంకట లక్ష్మి పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యులు అనంతపురం రెఫర్ చేశారు. ఘటనపై జొన్నగిరి పోలీసులు కేసు నమోదు చేశారు.

దేవదాయ శాఖకు రూ.2 లక్షల ఆదాయం

నార్పల: గూగూడు కుళ్లాయిస్వామి ఆలయం నుంచి దేవదాయ శాఖకు రూ.2 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ శోభ బుధవారం తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గూగూడు కుళ్లాయిస్వామికి ఉత్సవాల అనంతరం పోగైన చెక్కరను ఈ నెల 4న ఆలయ ప్రాంగణంలో వేలం వేయగా కేజీ రూ.34తో పలువురు కొనుగోలు చేశారన్నారు. మొత్తం 6,189 కేజీలకుగాను రూ.2,10,426 ఆదాయం వచ్చినట్లు ఆమె తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గంలో బుధవారం జరిగిన బాబు షూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమానికి వచ్చి ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. పోలీసుల వివరాల మేరకు... కంబదూరు మండలం రాళ్ల అనంతపురం గ్రామానికి చెందిన బాబా అనే టీడీపీ కార్యకర్త కళ్యాణదుర్గంలో జరిగే చంద్రబాబు సభకు వచ్చాడు. సభ అనంతరం తిరుగు ప్రయాణంలో కళ్యాణదుర్గం పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ వైపు నడుచుకుని వెళ్తుండగా వెనుక వైపు నుంచి గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీ కొంది. బాబా తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఇక్కడి వైద్యులు అనంతపురం తీసుకెళ్లారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిశీలన



ఉరవకొండలో చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

ఉరవకొండ: స్థానిక గుంతకల్లు రోడ్డులో మేజర్ పంచాయతీ వారు ఏర్పాటు చేసిన చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని బుధవారం కేంద్ర బృందం సభ్యులు నాగేంద్ర, బాలగంగిరెడ్డి, అనంత శ్రీనాథ, మేజర్ పంచాయతీ సర్పంచ్ లలితమ్మ, ఈఓ గౌస్‌సాహెబ్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం కేంద్ర బృందం సభ్యులు మాట్లాడుతూ చెత్తతో సంపద తయారీ కేంద్రాల్లో పొడి, తడి చెత్త వేర్వేరుగా వేస్తున్నారన్నారు. ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమం ఎంతో విజయవంతం అవుతుందన్నారు. ప్రజలు కూడా పంచాయతీ వారికి సహకరిస్తూ ఇంట్లోని చెత్తను వారికి అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా రాజగోపుర కలశ ప్రతిష్ట

గుంతకల్లుటౌన్: పాతగుంతకల్లులోని రామలింగేశ్వరస్వామి ఆలయ రాజగోపుర కలశ ప్రతిష్టాపన కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది. నూతన రాజగోపురాన్ని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. రామలింగేశ్వరస్వామి వారిని దర్శించుకున్న ఆయన కలశస్థాపన, హోమాలు, తదితర పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ రాజగోపురాన్ని అద్భుతంగా నిర్మింపజేసిన ఆలయ కమిటీ చైర్మన్ ఎం.వెంకటరెడ్డి, సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. భక్తులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అన్నదానం ప్రారంభించారు. ఎమ్మెల్యే వైవీఆర్, రిటైర్డ్ ఆర్‌టీఓ సోమిరెడ్డి, బళ్లారి భీమిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రామలింగప్ప, తదితర ప్రముఖులను ఆలయ కమిటీ చైర్మన్ వెంకటరెడ్డి పూలమాల, శాలువాతో సత్కరించగా వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ఆలయానికి జనరేటర్‌ను ఇవ్వాలని వెంకటరెడ్డి కోరగా తప్పనిసరిగా అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు నగేష్, కేశప్ప, కోశాధికారి వీరుపాక్షిరెడ్డి, సభ్యులు మస్తానయ్య, కమలేష్, సురేష్, మధు, అర్చకుడు ప్రసాద్, ఎం.తిమ్మారెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్‌వీఆర్.మోహన్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, కసాపురం ట్రస్ట్ బోర్డు సభ్యుడు మల్లికార్జున రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ జింకల రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.